


ఈ వారం తెలుగు పుస్తకం

# తన మార్గం

## అబ్బూరి ఛాయాదేవి కథలు

మృణాళిని



Title : TANA MARGAM
Author: Abburi Chayadevi
Year of Publication: 2002
Pages : 240 : Paper Back
Price: US$ 2.31

***అతి తక్కువ రచనలతో అత్యధిక ప్రభావాన్ని పాఠకులపై ప్రసరింపజేసే సామర్థ్యం అందరికీ ఉండదు. కేవలం పాఠకులకే కాదు, తన తోటి రచయితలు, తన తరువాతి తరం రచయితలకు కూడా ప్రేరణగా నిలబడ్డం సామాన్య విషయం కాదు. అలాంటి రచయితలు ఏ భాషలోనైనా అరుదే. అబ్బూరి ఛాయాదేవి అటువంటి అరుదైన రచయిత్రి. జీవితంలోని అతి సాధారణమైన విషయాలను నూతన దృక్కోణంతో చూసి, అర్థం చేసుకుని, సరళమైన పద్ధతిలో పఠితలకు అందించడం వీరి ప్రత్యేకత. ఆ సాధారణ విషయాలేమిటి? ఆ నూతన దృక్కోణం ఎటువంటిది? అన్న విచికిత్స మన విశ్లేషణా వ్యూహంగా పెట్టుకుంటే, ఛాయాదేవి కథల ఔన్నత్యం మనకు అర్థమవుతుంది.***

రచయితలకూ, రచనలకూ జండర్ ఉంటుందా అన్న ప్రశ్నకు 'ఉంటుందని' సమాధానమిచ్చే ఛాయాదేవికి తనను తాను 'వుమెన్ రైటర్' అనుకోవడం, స్త్రీల గురించి, స్త్రీ కోణం నుంచి, స్త్రీ పురుషులిద్దరికోసం తను రాస్తానని చెప్పడం గర్వించే విషయాలు. పైకి సకల జన సమ్మతంగా ఉండే ప్రవర్తన వెనక స్త్రీలు ఎంత నిగూఢమైన భావసంఘర్షణను దాచుకుంటారో, అది ఎలా వారి ఆంతర్యానికే పరిమితమవుతుందో, ఎలా క్రమేపి వారి జాగృత జీవితాన్ని కూడా ఆక్రమించి, వారి ప్రవర్తినలో సైతం మార్పు తీసుకురాగలదో అతి సున్నితంగా చిత్రిస్తాయి ఛాయాదేవి కథలు. కొన్ని కథలు నిగూఢభావ సంఘర్షణ చిత్రణకే పరిమితమవుతాయి. మరి కొన్ని ఆ సంఘర్షణ కార్యరూపం దాల్చడాన్ని చిత్రిస్తాయి. ఇతివృత్తాన్ని బట్టి, కథా సందర్భాన్ని బట్టి, రచయిత ఆశించిన ప్రయోజనాన్ని బట్టి, కొన్ని కథలు ఉన్నది ఉన్నట్టు చెప్పడంతో ఆగిపోవచ్చు. కొన్ని ఉండాల్సిన పరిస్థితిని సూచించవచ్చు. కథా కల్పన ఎలా ఉన్నా, కథల పరమ లక్ష్యం ఒక్కటే. స్త్రీలు తమ జీవితాలను గురించి మరింత లోతుగా ఆలోచించాలి. తాము ఎదుర్కొంటున్న వివక్షకూ, సంఘర్షణలకూ స్పందించాలి. ఆ స్పందన వారి జీవితంలో గుణాత్మకమైన మార్పుకు దారి తీసేలా ఉండాలి. ఈ గుణాత్మకమైన మార్పు వారి జీవితంలో ఎప్పుడూ ఆనందాన్నే తీసుకువస్తుందా? అంటే తీసుకురాక పోవచ్చు. కానీ ఆత్మగౌరవాన్ని మాత్రం నిలుపుతుంది. రాజీలు, దాసోహాలు, భరించడాల వల్ల కలిగే ఆనందం కంటే ఆత్మ గౌరవం నిలపుకోవడం స్త్రీకి సంతృప్తిని ఇస్తుంది. అలాంటి సంతృప్తి కోసం స్త్రీ ప్రయత్నించాలి. అవసరమైతే పోరాడాలి. స్థూలంగా ఛాయాదేవి కథల సారం ఇది.

1952లో కాలేజి మాగజైన్ కథతో ప్రారంభించి, ఛాయాదేవి రాసిన కథల సంఖ్య, 2005 జనవరిలో సాహిత్య అకాడమీ సమావేశాల కోసం రాసిన కథ వరకూ లెక్కిస్తే, 50కి దాటదు. అటువంటి కథలు 28 మాత్రం ఎంపిక చేసి, లిఖిత ప్రెస్ 'తన మార్గం' అనే పేరిట 2002 అక్టోబర్‌లో ప్రచురించిన పుస్తకం చదివితే, ఛాయాదేవి కథ రచనా సారం తెలుస్తుంది. ఈ కథల ఎంపిక స్వయంగా రచయిత్రి చేసినదే. దీనికి ముందు మాట రాస్తూ, లిఖిత ప్రెస్ తరఫున సజయ ఈ కథల్ని ఇలా పరిచయం చేసారు.

*'స్త్రీల నిత్య జీవితంలో వుండే సమస్యలు, సంఘర్షణలు, సంక్లిష్ట అనుభవాలను సునిశితమైన శైలిలో ఛాయాదేవి గారు కథల్లో చిత్రించారు. ఆమె కథలు సామాజికంగా, కుటుంబపరంగా స్త్రీ పురుషుల మధ్య వున్న అసమ సబంధాలను వ్యంగ్యాత్మకంగా, ఆవిష్కరిస్తూ ఆలోచింపజేస్తాయి. జీవితాన్ని స్త్రీ దృష్టితో పరిశీలించే ఛాయాదేవిగారి కథలు చదువుతుంటే మన లోలోపలి సంఘర్షణల్ని ఆత్మ బంధువులతో పంచుకుంటునట్లుగా వుంటుంది'.*

నిజంగానే ఆమె కథలు ఒక పరిణత మనస్కురాలైన స్త్రీ,తోటి స్త్రీలకు తన గురించి చెప్పకుంటున్నట్లుగా ఉంటాయి. అయితే ఆ వస్తువులో పలచదనం ఉండదు. కథనంలో 'సోది' ఉండదు. ఏడుపు అసలే ఉండదు. ఒక రకమైన నిస్సంగత్వం, హాస్య స్ఫూర్తి వీరి కథన లక్షణాలు. ఈ లక్షణాలను సోదాహరణంగా పరిశీలించాలంటే, ముందుగా ఈ పుస్తకంలోని వీరి కథా వస్తువును వర్గీకరించుకుని విశ్లేషించుకోవాలి.

*1. భార్యా భర్తల సంబంధాలు*

*2. స్త్రీ జీవిత నిర్వచనాలు*

*3. సామాజికురాలిగా స్త్రీ*

*4. ఇతరాలు*

### *1. భార్యా భర్తల సంబంధాలు*

మొదటి శీర్షిక కింద, భార్యా భర్తల సంబంధాల్లో ఉన్న వైవిధ్యాన్ని, ఆ వైవిధ్యం మాటునే ఉన్న యాంత్రికతను గొప్పగా వ్యాఖ్యానించే కథలు ఉపగ్రహం, శ్రీమతి-ఉద్యోగిని, నలుగురి కోసం, వెండి పండగ, సతి, నిర్ణయం, రెండు కాదు ఇరవై రెండు, మొగ్గ, ఆయన కీర్తి వెనక. భర్తకు సంబంధించి భార్య ఉనికి ఏమిటి? అతను లేని జీవితం ఆమెకుందా? భార్య ఆనందానికీ, దుఃఖానికీ అన్నిటికీ అతనే కేంద్రం. అతనే ప్రేరణ. దానికి ఆమెకు అభ్యంతరం కూడా లేదు. కానీ అతనికి ఆ స్పృహ ఉందా? తన చుట్టూ తిరిగే ఒక ఉపగ్రహం ఉందన్న ఆలోచన, ఆ వ్యక్తికోసం తను కూడా ఏదైనా చేయాలన్న బాధ్యత అతనికి ఉన్నాయా అని ప్రశ్నించే సున్నితమైన కథ 'ఉపగ్రహం'. తను ఎప్పుడు వచ్చినా, ఎలా ప్రవర్తించినా తన అవసరాలు పొల్లుపోకుండా తీర్చే భార్యకు కూడా స్వల్పమైన ఆశలు, అవసరాలు ఉంటాయని గుర్తించని భర్తతో కలిసి ఒక సినిమా చూడాలన్న కోరికే గొంతెమ్మ కోరిక అయిపోయిన స్థితిని ఈ కథ చక్కగా అభివర్ణిస్తుంది. అందుకే ఈ కథానాయిక అనుకుంటుంది 'ఆయనే నా జీవిత సర్వస్వం అనుకుంటున్నానే - ఆయన తప్ప నాకింక ఇప్పుడు జీవితంలో మరో ఇష్టం కనిపించటం లేదుకదా- ఆయన కూడా అలా ఎందుకనుకోరు? నేను ఆయన జీవితంలో కేవలం మరోక అదనపు సౌఖ్యం మాత్రమేనా?' అష్టయిశ్వర్యాల్లో భార్యను చేర్చిన సంస్కృతిలో భార్య అదనపు సౌఖ్యం కాక ఏమవుతుంది? చాలా లోతయిన భావాన్ని, మన సమాజంలో భార్య స్థానాన్ని అద్భుతంగా వ్యాఖ్యానించిన వాక్యమిది.

తమ రజతోత్సవ వివాహసందర్భాన్ని వేడుకగా జరుపుకోవాలని ఉత్సాహంగా ఉన్న అరుణకు పెళ్లి అనే వ్యవస్థలోని బోలుతనం, అభద్రత, కృత్రిమత్వం తెలిసి వస్తాయి (వెండి పండగ). ఎంతగానో ఎదురు చూస్తున్న వేళ దగ్గరవుతుండగా, తన భర్తకు ఒక విద్యార్థినితో 'అన్యోన్య' సంబంధం ఏర్పడిందని తెలిసి, నిర్ఘాంతపోతుంది. అసలు భార్యాభర్తలు వైవాహిక జీవితం వార్షికోత్సవాలు జరుపుకోవడంలో ఎంత యాంత్రికత, కృత్రిమత్వం ఉంటాయనే వేదన ఆమెలో కలుగుతుంది.

'పాతికేళ్ళు వచ్చినా పటిష్టత లేదా వివాహ సౌధానికి, ఒక్క పిల్లగాలి విసురుకే బీటలు తీసి కూలిపోతుందా - అలా కూలిపోకుండా నిలిచినందుకే 'వెండి పండగ' చేసుకుంటారా దంపతులు? ఆ పండుగ దాటితే ఇక కూలిపోదన్న నమ్మకం ఏర్పాడుతుందా' అనుకుంటుంది. భర్త వంచన గురించి తెలిసినా, ఏం జరగనట్టు మామూలుగా ప్రవర్తించే చాకచక్యాన్ని భార్యలు అలవరచుకోవడం అందరికీ తెలిసిన సత్యమే. ఈ నాయిక కూడా అదే పని చేస్తుంది.

భార్య భర్తల సంబంధంలోని మరో ముఖ్యమైన కోణం సంతానం, భార్య తల్లిగా మారాక, తన భర్త పట్ల విధులకు, పిల్లల పట్ల ప్రేమకు వైరుధ్యం వస్తే ఆమె దేన్ని ఎంచుకోవాలి? భారతీయ సంప్రదాయంలో, ఇలాంటి పరిస్థితుల్లో భార్య పాత్రే నెగ్గుతుంది. సాధరణంగా తల్లి ఓడిపోతుంది. ఆ సత్యాన్ని తెలిపే కథ 'ముగ్గు'. తనకిష్టంలేని పెళ్ళి చేసుకున్న కొడుకుని తండ్రి తిరస్కరిస్తాడు. పెళ్ళి పార్టీకి వెళ్లడానికి అంగీకరించడు. కొడుకుకు నచ్చిన పిల్లను చేసుకునే హక్కు ఉందని నమ్మిన కథానాయక భర్తకు నచ్చజెప్పి పెళ్లికి వెళ్తే, ఇక మళ్ళీ తన దగ్గరికి రానక్కర్లేదని భర్త ఆదేశం. తండ్రీకొడుకుల మధ్య నలిగిపోవడం తల్లులకు మామూలే. ఈ మామూలు సన్నివేశాన్నే చిత్రిస్తూ, దానికి ఒక ఆలోచనాత్మకమైన ముగింపుని ఇస్తారు ఛాయాదేవి. కథానాయిక కొడుకు దగ్గరికి వెళ్ళకపోవడానికే నిర్ణయించుకుంటుంది. 'కొడుకు దగ్గరికి పోతే వాడింతకన్న నిర్వాకం చేస్తాడని నమ్మకం ఏమిటి? వాడు మాత్రం మగవాడు కాడూ? 'ఈయన' కాకపోతే 'వాడు' అనుకోవాలి? స్త్రీ సమస్యల వెనక ఉన్నది వ్యక్తులు కాదు, పితృస్వామ్య భావజాలమే అన్న సత్యాన్ని అతి సున్నితమైన మాటల్లో ఇక్కడ చెప్పారు రచయిత్రి. చివరికి వంట ఇంట్లోకి నడుస్తూ అనుకుంటుంది - 'భార్యలా, బానిసలా కాదు -ఆయన అవసరాలు తీర్చే తల్లిలా. నా కొడుక్కి ఇప్పుడు నా అవసరం లేదు. కాబోయే కోడలు చూసుకుంటుంది. ఈయనకి నేను తప్ప చూసే దిక్కెవరు?' జీవిత చరమాంకం వరకూ భార్య భర్తకు తోడుగా ఉండక తప్పని పరిస్థితిని ఎంతో చక్కగా వ్యాఖ్యానించింది ఇక్కడ రచయిత్రి, అదీ మెలోడ్రామాతో కాదు. తార్కికతతో. ఛాయాదేవి రచనలోని విలక్షణత అదే. మరో చోట భర్తకోసం భార్య చేసే గుర్తింపు లేని చిన్న త్యాగాలను ఆమె చిత్రీకరిస్తారు. పిల్లి ప్రధాన పాత్రధారిగా ఉన్న బ్రహ్మాస్త్రం కథలో, పిల్లి మీద ఎంత మమకారం ఉన్నా, భర్త భయానికి దానితో తెగదెంపులు చేసుకుంటుంది. పిల్లిని పెంచుకోవాలన్నది కూడా ఆమెకు గొంతెమ్మ కోరికే. ఇది పైకి సరదాగా చదివించే కథగా అనిపిస్తుంది. కానీ, భార్య తన అల్పమైన కోరికను కూడా భర్త అనుమతి లేకుండా తీర్చుకోలేదన్న వాస్తవాన్ని చూపిస్తుంది.

భర్త సామాజిక విజయాలలో, కీర్తి ప్రతిష్ఠల్లో భార్య పాత్ర ఎంత ఉన్నా, దానికి గుర్తింపు సున్నా అన్న నిజాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన కథలు 'సతి', 'ఆయన కీర్తి వెనక'. 'సతి' కథలో భార్య సత్యవతి, భర్త తిరుమల రావుల పేర్లు కలిపి 'సతి' అనే కలం పేరుతో ఇద్దరు రచయితలుగా గొప్ప గుర్తింపు పొందుతారు. మొదట రచనలు చేసింది భార్యే అయినా, క్రమేపి భర్త రచనా వ్యాసంగంలోకి దిగి, తన సాహిత్య జీవితంలో భార్య పాత్రను అంగీకరించడం మానేస్తాడు. చివరకు భర్త చనిపోతే, పాఠకులు, తోటి రచయితలు, ప్రచురణ కర్తలు సంతాప సభ పెట్టి అతని మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటు అని తీర్మానిస్తారు. తొలిదశలో భార్య మూలంగానే, ఆమె తన కథల్లో అతనికి భాగస్వామ్యం ఇచ్చినందువల్లే రచయితగా మారిన తిరుమలరావే అందరికీ రచయితగా కనిపిస్తాడు. దీని వెనక ఉన్న భార్య వారికి గుర్తురాదు. ఈ సన్నివేశం పై రచయిత్రి ఇలా వ్యాఖ్యానిస్తారు.

'అందరూ ముక్త కంఠంతో 'సతి' మరణించిన మాట మీదే వ్యాఖానిస్తున్నారు గానీ, 'సతి' లో 'స' ఇంకా బ్రతికే ఉందన్న స్పృహలేదు ఎవరికీ... సత్యవతి బతికే ఉన్నది కనక 'సతి' పేరున రచనలు కొనసాగగలవన్న ఆశాభావాన్ని ఎవ్వరూ... వక్తలలోని రచయిత్రులు కూడా ప్రస్తావించలేదు. అక్కడ జరిగిన 'సాహితీ సతి' ఎవరి దృష్టికీ రాలేదు'. ఇక్కడ, తన ప్రమేయం లేకుండానే, తనకు రచనా వ్యాసంగం నుంచి విరమించాలన్న అభిప్రాయం కూడా లేకుండానే సమాజం సత్యవతి చేత భర్త సాహితీ చితిపై సహగమనం చేయించింది. అందుకే ఆ తర్వాత ఆమె ఒక్క రచన కూడా చేయలేదు.

ప్రతి ఉద్యమంలోనూ ఆక్టివ్‌గా పాల్గొనే వాళ్లతో పాసివ్‌గా పాల్గొనే వాళ్ళుంటారు. స్త్రీలు సాధారణంగ ఈ రెండో కోవకు చెందుతారు. మొదటి రకం వారికి గుర్తింపు, గౌరవం, సమాజంలో పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. రెండో రకం వారి ఉనికి కూడా చాలా మందికి తెలీదు. ఈ స్పృహ కొంత కలిగిన తర్వాత ఒక నినాదం మొదలైంది. 'ప్రతి పురుషుడి విజయం వెనకా ఒక స్త్రీ ఉంటుంది'. ఇది కూడా క్రమేపి పడికట్టు మాటగానే తయారైంది. పత్రికా విలేకర్లు ఒక యాంత్రిక ప్రశ్నగా అది అడగడం, ప్రతి పురుషుడూ తన భార్య పేరు చెప్పడం కూడా ఒక ఫేషన్‌గానే తయారైంది. నిజానికి ఆ స్త్రీ ఆ పురుషుడి విజయం వెనక ఉందనడం వాస్తవం కాదు; ఆ విజయం ఆమెది కూడా. ఈ సూక్ష్మమైన అంతరాన్ని పురుష ప్రపంచం ఇంకా గుర్తించడం లేదన్న నిజాన్ని ఛాయాదేవి 'ఆయన కీర్తి వెనక' అన్న కథలో గొప్పగా చెప్పారు. స్వాతంత్ర్యోద్యమంలో భర్త చేసిన 'త్యాగాలకు' అతని తండ్రి చిల్లిగవ్వ ఇవ్వకపోతే, తను ఇచ్చిన పుట్టింటి ఆభరణాలు, అతను ఉద్యమం కోసం ఇల్లు వదిలి వెళ్తే, పిల్లల్ని అష్ట కష్టాలకోర్చి పెంచడంలో తను చూపిన ధైర్య సాహసాలు కనీసం తన భర్త కూడా తలచుకోకపోవడం సీతమ్మకు ఆశ్చర్యం, ఆవేదన కలిగిస్తాయి. విలేఖరి తనను పొగుడుతుంటే, నిజంగా ఆ విజయమంతా తన ఒక్కడిదేనని భర్త అంగీకరించడం, ఫోటోలో కూడా భార్య రానవసరం లేదని అనడం చూసి సీతమ్మ అనుకుంటుంది. 'ఆనాడు తను ఎవర్నీ లెక్క చెయ్యకుండా ఆయనలా దేశం కోసం తెగించి జైలుకి వెళ్ళడానికి సిద్ధపడి వుంటే, ఈ రోజున ఆ పత్రిక అతను తనని కూడా తన పోరాటానుభవాల గురించీ, తను చేసిన త్యాగాల గురించి, అడిగి, తన గురించి పేపర్లో రాసేవాడు కదా' అని. ఇది స్వాతంత్ర్యోద్యమానికే కాదు, అన్ని ఉద్యమాలకూ వర్తిస్తుంది. ఉద్యమాల్లో పురుషుడు కార్యశీలిగా పాల్గొనడం, అతని కుటుంబాన్ని భార్యో, తల్లో నిలబెట్టడం సర్వ సాధారణంగ జరుగుతున్నవే. అందుకే ఈ కథలోని సందేశం ఈనాటికీ వర్తిస్తుంది. సూక్ష్మంగా చూసినపుడు ఉద్యమానికి వీరిద్దరూ చేసిన సేవ సమానమైనదే. కానీ పురుషుడిది అసలైన సేవ గానూ, స్త్రీ అతని వెనక ఉంటూ కేవలం సహకరించిన వ్యక్తిగానూ గుర్తింపు పొందుతారు. స్త్రీ పురుషులు సమాజానికి చేసే కంట్రిబ్యూషన్‌ని సమాజం ఎంత వివక్షతో చూస్తోందో ఈ రెండు కథల ద్వారా ఛాయాదేవి చెప్పారు.

ఇక మన సంస్కృతిలో స్త్రీకి సంబంధించి అతి ముఖ్యమైన భావన, పాతివ్రత్యం దీనిపై రాసిన కథ రెండు కాదు ఇరవై రెండు. హాస్యంగా రాసిన ఈ కథలో ద్రౌపది చెప్పిన పతివ్రతా లక్షణాలు రచయిత్రికి మన పురాణాలు, సంప్రదాయం స్త్రీకి భార్యగా ఇచ్చిన స్థానంపై ఉన్న అభిప్రాయాలను వ్యంగ్యంగా తెలియజేస్తాయి. ఇంతకు ఈ పతివ్రతా సూత్రాలు ద్రౌపది చేత చెప్పించింది వ్యాసుడని ప్రధాన పాత్ర గుర్తించడంలోనే కథలోని కీలకమంతా దాగి వుంది. పురుషాధిక్య సమాజంలోని స్త్రీకి భార్యగా ఉన్న స్థానాన్ని పురుషుడు తనకు అనుకూలంగా మలచిన విధానాన్ని ఆమె చక్కగా వ్యాఖ్యానిస్తుంది.

### 2. స్త్రీ జీవిత నిర్వచనాలు :

భార్యభర్తల సంబంధంలో భార్యది ఎప్పుడూ తక్కువ స్థానమేనని గుర్తించిన రచయిత్రి అసలు స్త్రీ జీవితంలో ఏవి ముఖ్యం, దేనికి స్త్రీ ప్రాధాన్యమివ్వాలి, ఈ ప్రాధాన్యమివవ్వడంలో సమాజ సూత్రాలతో వైరుధ్యం ఏర్పడితే స్త్రీ తన అస్తిత్వాన్ని ఎలా గౌరవించుకోవాలి అనే అంశాలను కూడా తన కథల్లో చర్చించారు. ఈ కథలలో, నిజస్థితిని తార్కికంగ వ్యాఖ్యానించేవి, దానిలో మార్పులు రావాలని ఆశించేవి కూడా ఉన్నాయి. ఇలాంటి కథల్లో రచయిత్రి, స్త్రీ జీవితానికి ఇచ్చే పడికట్టు నిర్వచనాలను తిరస్కరిస్తారు. స్త్రీ తన జీవితాన్ని విశాలమైన, నూతనమైన కోణం నుంచి ఆవిష్కరించాలని ప్రబోధిస్తారు. ఈ కథల్లో కొన్ని *'ప్రయాణం, 'బోన్సాయ్ బతుకు', 'ఉడ్ రోజ్', 'సుఖాంతం', తన మార్గం; ఎవరి పిడుపు వారిది, ప్రశ్నార్థకం'.*

తన ప్రమేయం లేకుండా తన శరీరం మలినమైనపుడు ఆ స్త్రీ ఎలాంటి వైఖరిని అవలంబించాలి? పురుషుడికి స్త్రీ

భోగ్యవస్తువయినపుడు, స్త్రీ ఏం చెయ్యాలి? అనే విషయాలను ఆసక్తికరంగా చర్చించిన పెద్ద కథ 'ప్రయాణం'. రమ అనే ఉద్యోగిని తన స్నేహితురాలి ఇంటికి వెళ్ళి, అక్కడ ఆమె భర్త కామానికి బలవుతుంది. స్నేహితురాలు సుధ ఈ విషయం తెలిసి కూడా రమను ఆదుకోడానికి, గాని, భర్తను మందలించడానికి గానీ పూనుకోదు. తనను వదిలి వెళ్ళనంతకాలం భర్త ఎన్ని తిరుగుళ్ళు తిరిగినా ఎందరు స్త్రీలను అనుభవించినా చూసీ చూడనట్టు ఊరుకునే స్థితికి ఆమె ఎప్పడో చేరుకుంది. తన ఉదాసీనత తోటి స్త్రీని గాయ పరుస్తున్నదన్న జ్ఞానం కూడ ఆమెకి ఉండదు. రమకు ఈ సన్నివేశం తీరని గాయంగా మారినా, తను ప్రేమించి పెళ్ళాడబోతున్న మూర్తికి అబద్ధం చెప్పడం ఇష్టంలేక జరిగిన సంఘటన చెపుతుంది. సగటు మగవాడైన మూర్తి ఈ నిజాన్ని జీర్ణించుకోలేకపోతాడు. మూర్తి వైఖరిని భరించలేని రమ, జీవితం నుంచి పారిపోవడమే తనకు నిష్కృతి అని భావించి, ఒక స్వామీజీ ఆశ్రమానికి బయల్దేరుతుంది. ఆ సమయంలో తను మూర్తి మీద ప్రేమతో తిరస్కరించిన శేఖర్ తటస్థపడి, ఆమె నుంచి విషయం తెలుసుకుని, ఆమె ఆలోచనల్లోని అల్పత్వాన్ని విమర్శిస్తాడు. శరీర మాలిన్యం గురించి ఆమెకున్న అపోహలని తొలగించి ఆమె సాహచర్యం తనకు కావాలని అంటాడు. రమకు శేఖర్‌లో తను కోరుకున్న నిజమైన సహచరుడు కనిపిస్తాడు. అతనితో కలిసి జీవితం పంచుకోడానికి అంగీకరిస్తుంది.

సాధారణంగా స్త్రీ పురుషుల మధ్య కలిగే ఆకర్షణ, ప్రేమల కంటే భిన్నంగానూ, స్త్రీ శీలానికి సంబంధించి సమాజం ఇచ్చే నిర్వచనాలకు విరుద్ధంగానూ చిత్రించిన ఈ కథ, తెలుగు కథానికల్లోనే గొప్పది. తన స్నేహితురాలి భర్త తనపై అత్యాచారం చేసాడు కనక తను మూర్తితో వివాహానికి అర్హత కోల్పోయిందని రమ చెప్పినపుడు శేఖర్ ఇలా అంటాడు.

*'మీరు కారులో రోడ్డు మీద పోతుంటే ఎదుటి నుంచి ఎవరో నియమాలకు వ్యతిరేకంగా మరో కారు నడిపించుకుంటూ వచ్చి మీ కారుని ఢీ కొంటాడు. మీ కారు దెబ్బ తింటుంది. మీరు మాత్రం సరయిన మార్గాన్నే, నియమబద్ధంగానే వెళ్ళారు. అయినా కారు పాడైంది. అక్కడ మీ మనస్సు 'నియమోల్లంఘనం' గురించి బాధపడవలసిన అవసరం లేదు కదా. కారుని బాగు చేయించుకుంటారు. అంతే'* అంటూ తన ప్రమేయం లేకుండా జరిగిన సన్నివేశానికి తను శీలాన్ని కోల్పోయానని బాధపడ్డంలో ఆమె ఎంత అవివేకంగా ఆలోచిస్తోందో అతను చెప్పిన వైనం చదివిన ప్రతి పాఠకుడికీ కొత్త ఆలోచన కలిగిస్తుంది. ఆమెకు జరిగిన సంఘటన కంటే ఆమె తెలివి తేటలు, పరిశోధనా శక్తి, విద్వత్తు చాలా గొప్పవి, ముఖ్యమైనవీ అనీ, వాటిని చూసుకుని గర్వపడుతూ, జీవితంలో ముందుకు నడవాల్సింది పోయి, అంతర్ముఖీనురాలు కావడం, అందరినుంచి దూరంగా ఆశ్రమ జీవితానికి పారిపోవడం అనాలోచిత చర్య అనీ శేఖర్ చెప్పిన మాటలు ఆధునిక స్త్రీ వ్యక్తిత్వానికి సరికొత్త నిర్వచనాలు. శీలం అనే పదాన్ని స్త్రీ దేహం పరంగా మాత్రమే వాడే పురుషాధిక్య సమాజ వైఖరిని నిశితంగా విమర్శించిన కథ ఇది. ఆ విమర్శ కూడా ఒక పురుషుడి నుంచి రావడం వల్ల, కథలో పరిణతి కనిపిస్తుంది.

స్త్రీ జీవితాన్ని గురించి కాచి వడబోసిన సత్యాన్ని చెప్పి, అంతర్జాతీయ స్థాయికి చెందిన కథగా పేరు పొందిన కథ 'బోన్సాయ్ బతుకు'. ప్రతీకాత్మక శిల్పంతో చెప్పిన ఈ కథలో ఒక పల్లెటూరి అక్క, మహా నగరంలో నివసించే చెల్లెలి ఇంటికి వచ్చినపుడు, ఆ నాగరిక చెల్లి ఇంట్లోని 'బోన్సాయ్ చెట్టు'ను చూసినపుడు చేసిన వ్యాఖ్యానమే వస్తువు. మహావృక్షాన్ని కూడ కుండీలో ఇమడ్చే జపాన్ వారి బోన్సాయ్ కళను గురించి అక్కకు చెప్పినా, ఆమె మెప్పు పొందలేకపోతుంది చెల్లెలు. వీరిద్దరూ ఈ కళను గురించి మాట్లాడుకుంటూండగా, గాలి దుమారం వచ్చి, పట్నం చెల్లి హడావిడిగా బోన్సాయ్ కుండీలను లోపలికి తెచ్చి దాచిపెడుతుంది. అదే సమయంలో అక్క కిటికీలోంచి చూస్తు అక్కడ తురాయి చెట్టు కింద వర్షం నుంచి ఆశ్రయం కోసం చేరిన జనాన్ని చూస్తుంది. అప్పుడు అక్క అనే మాటలు బహుశా

అనంతరం ఉద్యమ రూపంలో వచ్చిన స్త్రీవాదానికి నాందీ ప్రస్తావనగా చెప్పవచ్చు (ఈ కథ 1974లో వచ్చింది).

*'నువ్వు అపురూపంగా పెంచిన నీ బోన్ సాయ్ చూడు. చూట్టానికి కుదురుగా ముచ్చటగానే ఉంది సంసార పక్షపు స్త్రీలాగ. కానీ ఎంత సుకుమారమో చూడు. నువ్వు వెయ్యి కళ్ళతో కాపాడాలి దాన్ని - కాస్త తుఫానుకి కూడా తట్టుకోలేదు. తనే ఒకరి మీద ఆధారపడినప్పుడు మరొకరికి నీడ కూడా ఏమివ్వగలదు? మగవాడికి ఆడదానికీ పెంపకంలో ఉన్న తేడా వల్లనే కదుటే ఆడదాని బ్రతుక్కూడా 'బోన్ సాయ్' మాదిరి అయింది'.*

స్త్రీ జీవితాంతం మరొకరిమీద ఆధారపడక తప్పదని మను ధర్మ శాస్త్రం నుంచి సినీ గీత రచయిత (ఆరుద్ర-మల్లె తీగ వంటిది మగువ జీవితం) వరకు అందరూ అది తిరుగులేని, మార్చనక్కర్లేని సత్యంగా చెప్పడం మనకు తెలుసు. ఆ నిర్వచనంలోని, ఆ భావజాలంలోని లోపాన్ని, వక్రతను అతి సరళంగా తిప్పికొట్టి దాని గురించి పునరాలోచించవలసిన అవసరాన్ని గుర్తు చేసిన గొప్ప కథ ఇది.

ఈ ఆధారపడడాన్ని వ్యతిరేకించే ఒక వృద్ధురాలి కథ *'తన మార్గం'*. భర్తపోయిన తర్వాత తల్లి కొడుకులతో గానీ, అది కుదరని పక్షంలో కూతురితో గానీ ఉండాలన్నది సమాజ నియమం. ఎవ్వరి అండా లేనిదే ఏ వయసులోనూ స్త్రీ జీవించలేదనుకునే సమాజం వృద్ధాప్యంలో ఒంటరిగా గడిపితే జాలిపడుతుంది. ఆ పని ఆ మనిషి స్వచ్ఛందంగా చేస్తే, ముక్కున వేలేసుకుంటుంది. ఈ కథలో వర్ధనమ్మ ఆ పనే చేసి సమాజాన్ని, కుటుంబ వ్యవస్థా నియమాలను తిరస్కరిస్తుంది. భర్త బతికి ఉండగా అమ్మా, నాన్నల నుంచి తీసుకోవడమే తప్ప, వారి మంచి చెడులు కనుక్కోని కొడుకులు, తండ్రి చనిపోతూ స్వంత ఇంటిని తల్లి పేరట రాయడంతో ఆమె మీద ఎక్కడలేని ప్రేమ నటించడానికి వచ్చినపుడు, నిర్లిప్తంగా వారిని వదిలించుకుని, ఒంటరిగా ఉండాలన్న తన మార్గాన్ని నిర్ణయించుకున్న వర్ధనమ్మ పాత్ర మరపు రానిది. భర్తతో బయటకు వెళ్ళడానికి కూడా జంకిన ఆమె ఒక్కతే పార్కుకి వెళ్ళి, పిడత కింద పప్పు కొని తినడం ఆమె జీవితంపై చేసిన తిరుగుబాటుకు నిదర్శనం. భార్యగా, తల్లిగా, కోడలిగా, ఇల్లాలిగా వివిధ పాత్రలు నిర్వహిస్తూ, సమాజం ఆమోదం పొందే స్త్రీ జీవితంలోని ఒంటరి తనాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన కథ ఇది. *'నువ్వెందుకిలా ఒంటరిగా ఉండటం'* అన్న కొడుక్కి సమాధానంగా వర్ధనమ్మ అంటుంది *'ఇప్పుడు మాత్రం నేను ఒంటరిగా ఎక్కడున్నాను'* అంటూ *'ఆ మాటకొస్తే నేను జీవింతంలో ఒంటరిగా లేనిదెప్పుడు'* అనుకుంది మనసులో అని రాస్తారు రచయిత్రి. అనుబంధాలను బంధాలుగా చేసుకుని, వాటి నుంచి బయట పడలేక, వాటిలో తనను కోరుకున్న భద్రత, ఆనందం, ఆదరణ లభించక జీవితాన్ని నిస్సార్థంగా, పరాధీనంగా గడిపే స్త్రీ జాతికి ఈ వృద్ధురాలు ఎన్నుకున్న మార్గం గొప్ప స్ఫూర్తిని, సందేశాన్ని అందిస్తుంది. బహుశా అందుకే ఈ సంకలనానికి ఈ కథ పేరే పెట్టారు.

భర్త చనిపోయిన భార్య ఏడుస్తు ఉండాలన్న నియమాన్ని వేళాకోళం చేసే *'ఎవరి ఏడుపు వారిది'* *'నలుగురి కోసం'* హాస్య ధోరణిలో రాసిన మంచి కథలు. తన హద్దులు దాటి, ఇల్లంతా ఆక్రమించుకునే ఉడ్ రోజ్ తీగె లాంటి జీవితమే వృద్ధురాలైన తల్లిదనే ప్రతీక ధ్వనించేలా రాసన కథ *ఉడ్ రోజ్*. పిల్లలకు బంధాలు తెంచుకోవడం సాధ్యమే కానీ, తల్లికి ఉడ్ రోజ్‌లా అల్లుకోవడమే తెలుసన్న వాస్తవాన్ని నర్మగర్భంగా చెప్పిన మంచి కథ ఇది.

స్త్రీ మనస్తత్వంలో సహజంగా ఒదిగిపోయే మరొక అంశం సమాజం, భర్త గీచిన గీటు దాటకపోవడం. సమాజం పట్ల తనలో పాతుకుపోయిన భయాన్ని స్త్రీ తనంతట తాను వదిలించుకోవడం అవసరమని, అది అసాధ్యమేమీ కాదని చెప్పే కథ ధైర్యవాణి. పురుషుడు పెళ్ళికి ముందు ఏ కారణాల వల్ల ఒక స్త్రీని ప్రేమిస్తాడో, ఆరాధిస్తాడో, భర్త అయిన తర్వాత ఆ గుణాలే అతనికి కంటగింపుగా తయారవుతాయన్న సత్యాన్ని చెప్తుంది ఈ కథ. కన్యాశుల్కం నాటకంలో మధురవాణి

పాత్ర ఎవరు వేయాలన్న ప్రస్తావన వచ్చినపుడు భార్య వేస్తానంటే, ఆ వేశ్య పాత్ర తన భార్య వేయడమేమిటనుకునే సంకుచిత మనస్కుడైన భర్తను ఎదిరించి తను నటించడానికి పూనుకున్న ధైర్య వంతురాలు ఈ కథలో మనకు దర్శనమిస్తుంది. తన మాట నెగ్గించుకున్నాక నాయిక సాధన అనుకునే మాటలు అక్షర లక్షలు చేసేవి. *'ఎవరైనా ఏమనుకుంటారో, సమాజం ఏమనుకుంటుందో అనే భయాన్ని వదిలించుకోవడం ఎంత సులభం - నిజంగా తలచుకోవాలేగాని. ఆ సమాజం ఎక్కడుంది? ముందుగా తనలోనేగా?'* స్త్రీలందరూ ఆచరించాల్సిన మార్గాన్ని ఈ కథలో సూచించారు. స్త్రీ తన ప్రవర్తనకు, తన అభివ్యక్తికి తానే చేసుకునే సెన్సార్ షిప్‌ని కథ వ్యంగ్యంగా విమర్శిస్తుంది.

స్త్రీ జీవితంలోని యాంత్రికతను, అలసటను అతి వాస్తవికంగా, ఆర్ద్రంగా చిత్రించిన కథ *సుఖాంతం*. పుట్టింది మొదలు ముసలి తనం వచ్చేదాకా ఒక యంత్రంలా పనిచేసుకుంటూ పోయే స్త్రీకి నిద్ర చాలక పోవడం అన్న సమస్య సర్వ సాధారణం. తీరా ముసలితనం వచ్చాక నిద్రకు సమయం దొరికినా, నిద్రరాదు. ఆదమరచి నిద్రపోయే వయస్సు దాటిపోయి ఉండడమే దానికి కారణం. కానీ తనివి తీరా నిద్ర పోవాలనే కోరిక మాత్రం అలాగే ఉండిపోతుంది. కొన్ని దశాబ్దాల నిద్రలేమిని తీర్చుకోడానికి ఒకటో, రెండో నిద్ర మాత్రలు చాలవు. అందుకే, సీసాలోని మాత్రలన్నీ మింగేస్తుంది. కేవలం నిద్ర పోవడానికే. ఆత్మహత్య చేసుకోవడం లేదని భర్తకు ఉత్తరం రాసి పెడుతుంది. కానీ, ముగింపు అందరూ ఊహించగలిగిందే. వస్తువులోనూ, కథనంలోను అంతర్జాతీయ స్థాయికి చెందిన కథ ఇది.

స్త్రీ పురుషుడి మీద ఆధారపడుతుందన్నది సైద్ధాంతికమైన వాదమే కానీ, వాస్తవంలో పురుషుడే స్త్రీ పైన ఎక్కువ ఆధారపడతాడని చెప్పే కథ *'పరిధి దాటిన వేళ'*. కొడుకు, కోడలు, భర్త ఎవ్వరూ తనకు కావలసిన మందులు తెచ్చి ఇవ్వడం లేదని, దారి తెలీకపోయినా, ఒక్కతే మందుల షాపుకు వెళ్ళినందుకు, కొన్ని గంటలు కనిపించుకుండ పోయినందుకు ఇంట్లో వాళ్ళు చేసిన హంగామా, తనను వదిలి వెళ్లిందనుకుని భర్త పడ్డ భయం అతి సహజంగా చిత్రించిన కథ ఇది. ఇంటిల్లిపాదినీ కొద్ది సేపు ఓ ఆట ఆడించినందుకు ఆ ఇల్లాలు మహదానందం పొందడం కొసమెరుపు.

### *3. సామాజికురాలిగా స్త్రీ -*

కుటుంబ సంబంధాల్లో ఉనికి కోసం ప్రయత్నం చేయడం ఒక ఎత్తయితే, పురుష ప్రపంచలో తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నించే స్త్రీ సమస్యలు మరో రకం. ఎవరో ఒక పురుషుడికి లొంగితేనే తప్ప స్త్రీకి వృత్తిలో ఎదుగుదల సాధ్యం కాదనే సామాజిక 'నీతి'ని తూర్పారబట్టే కథ 'కర్త, కర్మ, క్రియ'. ఉద్యోగం చేసే స్త్రీ బయటి ప్రపంచంలో ఎన్ని అవమానాలు దిగమింగాలో, ఎంత రాజీ పడాలో, తిరగ బడితే, ఎలాంటి అపనిందలు ఎదుర్కోవాలో సమర్థంగా చెప్పిన కథ ఇది.

*శ్రీమతి* - ఉద్యోగిని కథలో చమత్కారంగానే అయినా, స్త్రీ ఉద్యోగిని అయినా, ఆమెకు ఇంట్లో లభించే సహకారం అంతంత మాత్రమేననీ, భర్తల్లో ఉద్యోగిని అయిన భార్య పట్ల చెప్పుకోదగ్గ సానుభూతి లేదనీ, స్త్రీకి రెండు బాధ్యతలూ తప్పడం లేదనీ వ్యాఖ్య ఉంది. అన్నిటి కంటే ముఖ్యంగా ఉద్యోగిని అయినా, సమాజంలో బాధ్యత గల జీవితాన్ని గడుపుతన్నా, లోపలి విషయాలు వెల్లడించేటప్పుడు స్త్రీ గుంభనగా, కొంత హిపోక్రెటికల్‌గా ఉండక తప్పడం లేదనే వేదన కూడా దాగి వుంది. నాయికను ఇంటర్వ్యూ చేస్తున్న అమ్మాయి *'మీరు మళ్ళీ జీవితం మొదలు పెట్టాల్సి వస్తే మళ్ళీ ఆయన్నే చేసుకుంటారా లేక పెళ్ళి చేసుకోకుండా ఉంటారా?'* అని ప్రశ్నిస్తే,

*'ఆయన్నే చేసుకుంటాను'* అంటుంది. మనసులో *'ఆలా అనటం భారత నారీ ధర్మం కదా!'* అని అనుకుంటుంది. అలా

కాక మరోలా అంటే, భర్తే కాదు. ఇంటర్వ్యూ చేసే అమ్మాయి, మొత్తం సమాజం కూడా షాక్ తింటారు. అందుకే మనసులో ఒకటి, బయటికి ఒకటి చెప్పడం స్త్రీలకు జీవితంలో అతి సహజమైన ప్రవర్తనా రీతి అయిపోయింది.

సామాజిక జీవితంలో స్త్రీ తోటి స్త్రీల అవసరాలను, ప్రయోజనాలను, కష్టాలను పరిగణలోకి తీసుకోవాలనీ, అధికారంలో ఉన్న స్త్రీ, తన కింది స్త్రీల సంక్షేమం కోసం ఆలోచించాలనీ చెప్పే మంచి కథ 'మార్పు'.

### 4. ఇతరాలు :

తన మార్గం సంపుటిలో స్త్రీ జీవితానికి సంబంధించినవే 90 శాతం ఆక్రమించినా, వేరే సమస్యలు చర్చించిన కథలు కూడా ఉన్నాయి. ఆఖరికి అయిదు నక్షత్రాలులో స్టార్ ఆస్పత్రుల లీలలు కళ్లకు కట్టినట్లు వర్ణించారు. రోగ నిర్ధారణ పరీక్షల దగ్గర్నుంచి, శవాన్ని తీసుకువెళ్లే వరకూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఎదురయ్యే చేదు అనుభవాలను అతి వాస్తవికంగా ఈ కథ చిత్రిస్తుంది. నగర జీవనంలో అందరూ ఎపుడో ఒకప్పుడు ఎదుర్కోక తప్పని పరిస్థితికి అక్షర రూపం ఇవ్వడంలో రచయిత్రి నేర్పు చెప్పకోదగ్గది. కర్నూల్లో కూరగాయల ధరల గురించి రాసిన 'అవకాశం' కూడా నగర జీవిత చిత్రాలను చూపేదే. చక్కని సామాజిక స్పృహతో రాసిన కథ ఇది.

ఈ సంపుటిలో ప్రత్యేమైన కథగా చెప్పకోదగ్గది తండ్రీ కుమార్తెల అనుబంధాన్ని వర్ణించే 'స్పర్శ'. బాల్యమంతా తండ్రి అరుపులకు జడిసి, అతనితో ఏ మాత్రం చనువు లేకుండా గడిపిన కూతురు జీవిత చరమ దశలో ఆ తండ్రికి ఓదార్పు ఇవ్వడానికి మాత్రం అవసరమైంది. ఆయన ప్రాణంగా చూసుకున్న కొడుకు చనిపోయి, తనను పరామర్శించడానికి కూతురే మిగిలింది. బాల్యంలో, తనకు అవసరమైనపుడు ఏనాడూ తండ్రి స్పర్శ ఆమెకు లభించలేదు. కానీ చూపు, వినికిడి పోయి, స్పర్శ మాత్రమే అర్థమయ్యే స్థితిలో ఈనాడు ఆ కూతురి స్పర్శే ఆయనకు సాంత్వన కలిగించింది. ప్రతి అక్షరంలో ఆర్ద్రత పండిన కథ ఇది. ఇన్ని రకాల కథ సమాహారమైన 'తన మార్గం' సంపుటిలోని కథల్లో స్త్రీ జీవితంలోని విభిన్న కోణాలున్నాయి. పురుషాధిక్యతపై నిరసన ఉంది. కానీ ఆ నిరసన తీవ్ర స్వరంతో తెలిపేది కాదు. కోమల స్వరంతో వివరించేది. ఛాయాదేవి 'టోన్'లో అంతర్లీనంగా ఐరనీ ఉంటుంది. హాస్యం ఉంటుంది. తనను చూసి తాను నవ్వుకోగల నిఖార్సయిన సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉంటుంది. ఐరనీ నిర్వహణకు ఆమె ఎన్నుకున్న రచనా శిల్పం అపూర్వమైనది. ఆమె కథల్లో సాధారణంగా నాయిక ఏక కాలంలో రెండు పనులు చేస్తుంది - అనడం, అనుకోవడం. స్త్రీ నిత్య జీవితంలో 'అనేవి' తక్కువ. 'అనుకునేవే' ఎక్కువ. స్త్రీ తన మనసులోని ప్రతి మాటా బహిర్గతం చేస్తే, పురుష ప్రపంచం భరించలేదు; సహించదు; బెదిరిపోతుంది అని తెలిసిన రచయిత్రి, ఈ శిల్పాన్ని అద్భుతంగా ప్రయోగించారు. దాదాపు ప్రతి కథలోనూ మనం ఈ శిల్పం చూడవచ్చు. పైన ఒకటి, లోపల ఒకటి అనుకోవాల్సిన అవసరం స్త్రీలకు అనివార్యం కావడానికి పురుషాధిక్య సంస్కృతిలో స్త్రీ అభిప్రాయాల పట్ల ఉన్న అసహనమే కారణమని మనకు పదే పదే గుర్తు చేస్తారు రచయిత్రి. 'అనడం' 'అనుకోవడం' శిల్పాన్ని తెలుగు కథానికల్లో ఇంత శక్తిమంతంగా, ప్రయోజనాత్మకంగా ప్రయోగించిన రచయిత్రి వీరే. హాస్యం ఆమె రెండో ఆయుధం. మూన్నాళ్ల ముచ్చట, రెండు కాదు ఇరవై రెండు, బ్రహ్మాస్త్రం, ఎవరి పిచ్చి వారిది కథల్లో ప్రధానమైంది హాస్యరచనే. కానీ చెప్పిన విషయాలు మాత్రం స్త్రీ జీవితంలోని అస్తవ్యస్త స్థితిని ఎత్తి చూపేవే. ఈ హాస్య రచన వస్తువును అంతర్ముఖురాలై కాక, బయటి నుంచి చూడగలగడం వల్ల ఛాయాదేవికి సాధ్యమైంది. స్త్రీ సమస్యలకు, స్త్రీ జీవితంలోని అస్తవ్యస్త పరిస్థితులకు స్త్రీగా స్పందిస్తూ కూడా హాస్య ధోరణిలో రాయగలగడం పరిణతి చెందిన రచయితలకే సాధ్యం.

స్త్రీవాద ఉద్యమం కనుచూపు మేరలో లేని రోజుల్లోనే పురుషులను కాక, పురుషాధిక్య భావ జాలాన్ని గుర్తించి

ఎండగట్టడం ఛాయాదేవి అవగాహనలోని గొప్పదనం. ఈ కథనాయికలు తిరుగుబాటు చేయకపోవచ్చు, (యువతరం స్త్రీలను గురించి చెప్పని 'నిర్ణయం', 'స్థాన మహిమ' వంటివి తప్ప). కానీ తమ స్థితిపట్ల, దానికి గల కారణాల పట్ల వారికి స్పష్టత ఉంది.

ఛాయాదేవి రచనలో టోన్ ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అంశం. రచయిత్రిగా ఆమె టోన్‌లోను, ఆమె సృష్టించిన స్త్రీ పాత్రల వైఖరిలోనూ నిరసన కంటే నిర్లిప్తత ఎక్కువ ధ్వనించడానికి కారణం ఆమె పై జిడ్డు కృష్ణమూర్తి భావాల ప్రభావం ఉండడం కావచ్చు. మరణం గురించీ, జ్ఞాపకాల గురించీ, కోరికల గురించీ రాసిన సందర్భాల్లో జే.కే. బోధల ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయి. మనకు సంజాయిషీల (Explanations) నుంచి, సమర్థింపుల (Jusifications) నుంచీ, తీర్పుల (Judgements) నుంచీ స్వేచ్ఛ కావాలన్న జే.కె. సూక్తులు ఈ కథల్లో అంతర్లీనంగా ధ్వనిస్తుంటాయి. మొగ్గ, గతాన్ని తవ్వకు, సమతా రేఖ, నిర్ణయం కథల్లో నిస్సంగత్వం సూదిలో దారంలా కనీ కనిపించకుండా స్ఫురిస్తుంది. 'నిర్ణయం' కథలో, పెళ్ళి గురించిన ప్రస్తావన వచ్చినపుడు, ప్రధాన పాత్రధారి అంటుంది. 'అమూల్య కూడా అదే ధోరణిలో ఆలోచిస్తోంది. పెళ్లంటే నూరేళ్ళ పంట. జీవితాంతం నేను ఫలానా వ్యక్తితో సుఖంగా బతక గలనా అని. వివాహ బంధం శాశ్వతంగా ఉండాలనీ, ఉంటుందనీ మన నమ్మకం. కానీ నిజంగా శాశ్వతమా? ఎవరో ఒకరు ముందు పోక తప్పదు కదా. అయ్యో. వీళ్లు ఒంటరిగా ఎలా బతుకుతారు, పిల్లలతో ఎలా తంటాలు పడతారు అని ఆగుతుందా మృత్యువు? అలాగే వివాహం చేసుకున్నాక ఆ వ్యక్తితో కాపురం చేయడం అసంభవం అనిపిస్తే విడిపోక తప్పదు, పర్యవసానాలు ఎలా ఉన్నా... 'మానవ సంబంధాలలోని అశాశ్వతత్వాన్ని గుర్తించడానికీ, బాహాటంగా దాన్ని చెప్పడానికి మనో నిబ్బరం కావాలి. అనుభవం నుంచీ, తార్కికమైన ఆలోచననుంచీ వచ్చిన పరిణతి కావాలి. *తన మార్గం* కథల్లో ఈ లక్షణాలే కనిపిస్తాయి. మానవ జీవితంలోని సంఘర్షణకు మూలకారణం ఒక మనిషి మరో మనిషిపై అధికారం చలాయించాలని చూడ్డమే అన్న అవగాహన (సమతారేఖ) పునాదిగా ఈ కథలు స్త్రీ పురుష సంబంధాలను లోతుగా తరచి చూశాయి.

ఈ కథల రచనలోని మరో ప్రత్యేకత అవి ఉత్తమపురుషలో రచించబడ్డం. ఇందులో 75 శాతం కథలు 'నేను' అని రాసుకున్న అబ్బూరి ఛాయాదేవి తను అనుభవించినవీ, విన్నవీ, కన్నవీ అయిన సంఘటనలను, సంయమంతో, సమ్యక్ దృష్టితో, అపూరూపమైన కథన చాతుర్యంలో మనకు అందించారు. స్త్రీ వాద ఉద్యమానికి గొప్ప ఊతాన్నిచ్చిన ఈ కథలు తెలుగు కథా సాహిత్యంలోనే అండర్ స్టేట్ మెంట్ ఎంత గొప్ప కథా శిల్పమో చెబుతాయి. చదివే కొద్దీ కొత్త రుచులు ఊరే ఈ కథలు స్త్రీ పురుషుల్లో హృదయ సంస్కారం పెంచడానికి ఔషధంగా పనిచేస్తాయి.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వదాన్య సౌజన్యంతో అందించబడింది.